క్లుప్తంగా

హైమాస్ట్ లైట్లు ప్రారంభం



హైమాస్ట్ లైట్లు ప్రారంభిస్తున్న సుడా చైర్మన్

మానకొండూర్: మండల కేంద్రంలోని పెద్దమ్మ తల్లి దేవాలయం ఆవరణలో హైమాస్ట్ లైట్లను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, ఉప సర్పంచ్ నెల్లి మురళి, కో–ఆప్షన్ సభ్యులు అమీరుల్లాఖాన్, వార్డు మెంబర్లు, ముదిరాజ్ సంఘం, బీఆర్ఎస్ నాయకులు నెల్లి శంకర్, రాచకట్ల వెంకటస్వామి, పిండి సందీప్, మహేష్, నెల్లి శ్రీనివాస్, తాళ్లపల్లి శేఖర్ గౌడ్, ఉండింటి సులోచన, పిట్టల కవిత, పాల్గొన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రసమయి బాలకిషన్

మానకొండూర్: మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు రాసూరి విన్నర్ అనారోగ్యంతో మృతి చెందగా ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు విన్నర్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. సర్పంచ్ మాశం షాలిని, కార్పొరేటర్ వాల రమణారావు, వాల ప్రదీప్‌రావు, నాయకులు శ్రీనివాస్, ప్రభాకర్, శాతరాజు యాదగిరి, ముల్కల కర ణ్, యామ శ్రీనివాస్ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్ పాల్గొన్నారు.

మండల స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం



పోటీలు ప్రారంభిస్తున్న విజయేందర్‌రెడ్డి

గంగాధర: మండలంలోని గట్టుభూత్కూర్ గ్రామంలో మైత్రి గ్రూప్స్ చైర్మన్ కొత్త జయపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించే మండల స్థాయి క్రికెట్ పోటీలను ఆదివారం సర్పంచ్ కంకణాల విజయేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. గతంలో చాలా సార్లు గ్రామంలో ఆటల పోటీలు నిర్వహించామని, క్రీడలు యువకుల మధ్య స్నేహభావాన్ని పెంపొదిస్తాయన్నారు. వారం రోజుల పాటు నిర్వహించే గంగాధర ప్రీమియర్ లీగ్ పోటీల్లో ప్రథమ బహుమతి రూ.12వేలు, ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు బహుమతి అందివ్వనున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శరత్‌కుమార్, ఎంపీటీసీ ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా మణిశంకర్‌రెడ్డి

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండ హనుమాన్ రెడ్డి సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడిగా కేతిరెడ్డి మణిశంకర్‌రెడ్డి ఆదివారం జరిగిన ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికయ్యాడు. ప్రధాన కార్యదర్శిగా గోపు జనార్దన్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా గంటల విద్యాసాగర్ రెడ్డి, దామెర మధుసూదన్ రెడ్డి, కోశాధికారిగా ఎల్లాల సంతోశ్ రెడ్డి, గౌరవ అధ్యక్షుడిగా తిరుపతిరెడ్డి, వై. స్వామిరెడ్డి, జి. స్వామిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భీంరెడ్డి, వెంకటరమణారెడ్డి, ఆదిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, గంగరెడ్డిలు నియామకమయ్యారు.

కాంగ్రెస్‌కు అండగా నిలవాలి



మాట్లాడుతున్న కవ్వంపల్లి సత్యనారాయణ

మానకొండూర్: ప్రజలు కాంగ్రెస్‌కు అండగా నిలవాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు కవ్వంపల్లి సత్యనారాయణ కోరారు. మండలంలోని అన్నారం గ్రామంలో గడపగడపకూ తిరుగుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ వ్యతిరేక విధానాలను వివరిస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి సంక్షేమాన్ని వివరించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులురవీంద్రచారీ, సత్యనారాయణ, సంపత్, మహేందర్, మల్లేశం, ఒదెలు పాల్గొన్నారు.

గుండ్లపల్లికి తరలిన నాయకులు



గుండ్లపల్లికి వెళ్తున్న నాయకులు

శంకరపట్నం: గన్నేరువరం మండలం గుండ్లపల్లిలో ఆదివారం రాత్రి నిర్వహించిన మహాసంపర్క్ అభియాన్‌కు శంకరపట్నం మండలం నుంచి బీజేపీ శ్రేణులు తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు అనిల్, నరేందర్, సారయ్య,సంపత్,జైపాల్, రవి,రమేశ్, శ్రీనివాస్,రాములు తదితరులు వెళ్లారు.

క్యాష్‌లెస్ సర్వీసులు

- పంచాయతీల్లో యూపీఐ సేవల అమలు దిశగా కసరత్తు
- అక్రమాలకు అడ్డుకట్ట, యూపీఐ గ్రామాలుగా ప్రకటించేందుకు కేంద్రం సన్నాహాలు

హుజూరాబాద్‌రూరల్: నగదు రహిత లావాదేవీలను మరింత విస్తృతం చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అన్ని గ్రామ పంచాయతీలను యూపీఐ గ్రామాలుగా ప్రకటించేలా కేంద్రం కార్యాచరణ రూపొందించేందుకు సన్నాహాలు చేస్తోంది. గ్రామ పంచాయతీల పరిధిలో జరిగే అభివృద్ధి పనులకు, పన్నుల వసూళ్లకు డిజిటల్ పేమెంట్ విధానం వినియోగించాలని కేంద్రం నిర్ణయించింది.

యూపీఐ గ్రామాలుగా ప్రకటనకు చర్యలు

ఆగస్టు 15 తర్వాత అన్ని పంచాయతీలను యూపీఐ వినియోగ గ్రామాలుగా ప్రకటించడానికి సిద్ధమవుతోంది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 1,211 పంచాయతీలు ఉండగా, కరీంనగర్‌లో 313, జగిత్యాలలో 380, రాజన్న సిరిసిల్ల 255, పెద్దపల్లిలో 218 పంచాయతీలలో డిజిటల్ చెల్లింపుల వినియోగం పెరిగింది. చిన్న దుకాణాల్లోనూ ఉపయోగిస్తున్నారు. యూపీఐ ఆధారిత చెల్లింపులు పెరిగిపోవడం, ప్రస్తుతం అందరి చేతుల్లో స్మార్ట్‌ఫోన్లు ఉండటంతో ఈ దిశగా అడుగులుపడుతున్నాయి. నగదు రహిత లావాదేవీలు పట్టణాల నుంచి పల్లెలకూ విస్తరించాయి. ఇందులో భాగంగా ప్రజలకు సులభంగా నగదు చెల్లింపునకు యూపీఐ సేవలను తెచ్చేందుకు చర్యలు చేపట్టింది. అన్ని పంచాయతీల్లో ఈ విధానాన్ని షూరూ చేసేలా పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు ఇచ్చింది.



పెద్దపాపయ్యపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

అక్రమాలకు అడ్డుకట్ట

ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో వివిధ పంచాయతీల్లో యూపీఐ ఆధారిత చెల్లింపులు ప్రారంభమయ్యాయి. పన్నుల వసూళ్లు, నిర్మాణాలకు అనుమతులు, జనన, మరణ ధ్రువపత్రాలు జారీ వంటి వాటికి సైతం వినియోగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం టీయాప్ ద్వారా ప్రోత్సహిస్తోంది. మీ సేవ ద్వారా చెల్లించే వాణిజ్య, వ్యాపార దుకాణాలకు సంబంధించిన పన్నులను డిజిటల్ రూపంలో సేకరిస్తున్నారు. కేంద్ర మార్గదర్శకాల ప్రకారం గ్రామ పంచాయతీలు తగిన సర్వీస్ ప్రొవైడర్లను ఎంపిక చేసుకోనున్నారు. అధికారులకు త్వరలో జిల్లా, డివిజన్, మండల స్థాయిలలో శిక్షణ శిబిరాల నిర్వహణకు కసరత్తు చేస్తోంది. గ్రామ పంచాయతీ వ్యవస్థలో అక్రమాలకు అడ్డుకట్ట వేసేందుకు అవకాశం దక్కనుంది.

పారదర్శకత పెరుగుతుంది



ఇప్పటికే గ్రామ పంచాయతీల్లో పలు సేవలు నగదు రహితంగా అందుతున్నాయి. ప్రభుత్వ మార్గదర్శకాలు రాగానే పూర్తి స్థాయిలో విస్తరించేందుకు చర్యలు తీసుకుంటాం. ప్రస్తుతం మీ సేవల ద్వారా చెల్లించేవి, ఖాతాల్లో జమ చేసేవి ఇదే తరహాలో జరుగుతున్నాయి. యూపీఐ సేవలు పూర్తి స్థాయిలో అందుబాటులోకి వస్తే మరింత పారదర్శకత పెరుగుతుంది.

– విజయలక్ష్మి, ఎంపీడీవో, హుజూరాబాద్

నూతన కార్యవర్గం



ఆంజనేయులు

తిమ్మాపూర్: ప్రైవేట్ హాస్టల్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా తిమ్మాపూర్ మండలం రామకృష్ణ కాలనీ సుభాష్‌నగర్ హాస్టల్ నిర్వాహకుడు నూనె ఆంజనేయులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలోని హాస్టల్స్ ఓనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎల్ఎండీ కాలనీలోని శ్రీ తాపాళ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆవరణలో ఆదివారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దేవేందర్‌రెడ్డిని నియమించగా, అధ్యక్షుడిగా నూనె ఆంజనేయులు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా మారోజు రాకేశ్, సెక్రెటరీగా బసవయ్య, సహాయ కార్యదర్శిగా బైరి చంద్రకళ, కోశాధికారిగా కట్కూరి నరసింహారెడ్డి, ఉప కోశాధికారిగా కట్టబ్రహ్మం, సలహాదారులుగా తాళ్లపల్లి శ్రీనివాస్, మార్కొండ రమేష్, కార్యవర్గ సభ్యులుగా తుమ్మ కిరిటిరెడ్డి, చిలుకూరి శ్రీకాంత్, రాకం భాస్కర్, కరికే ప్రశాంత్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ.. ప్రైవేట్ హాస్టల్స్ యజమానుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. అందరూ కలిసికట్టుగా ఉంటూ అసోసియేషన్ బలోపేతానికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో హాస్టల్స్ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ బోనాలు

గంగాధర: మండలంలోని నారాయణపూర్ గ్రామంలో ఆదివారం రెడ్డి సంఘం ఆధ్వర్యంలో రేణుకా ఎల్లమ్మ బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. ఆషాడ మాసం సందర్భంగా నిర్వహించిన ఎల్లమ్మ బోనాలలో ప్రతి ఇంటి నుండి మహిళలు బోనంతో ఆలయానికి తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు.

రామడుగు: మండలంలోని వెలిచాల గ్రామంలో గౌడ కులస్తుల ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గౌడ కులస్తులు ఇంటింటి నుంచి బోనంతో వీధుల గుండా ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి మొక్కులు స మర్పించి ప్రత్యేకంగా పూజలు చేశారు. కార్యక్రమంలో గౌడ కులసంఘం నాయకులు పాల్గొన్నారు.

రామడుగు: మండల కేంద్రంలో ముదిరాజ్‌ల ఆధ్వర్యంలో పెద్దమ్మతల్లి బోనాలు నిర్వహించారు. ఇంటింటి నుంచి బోనంత తీసుకెళ్లి పెద్దమ్మతల్లి నైవేద్యం పెట్టి ప్రత్యేకంగా పూజలు చేశారు. వేడుకల్లో చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పాల్గొన్నారు. కార్యక్రమంలో రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు, గోపాల్‌రావుపేట మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి, మాజీ ఎంపీపీ మార్కొండ కిష్టారెడ్డి, మాజీ సర్పంచ్ పంజాల జగన్‌మోహన్‌గౌడ్, నాయకులు శనిగరపు అనిల్, కోడిమ్యాల రాజేశం ముదిరాజ్ కులసంఘం నాయకులు పాల్గొన్నారు.

సంస్కృతి సాంప్రదాయాలు కాపాడుకోవాలి

మానకొండూర్: సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకోవాలని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మానకొండూర్‌లో పెద్దమ్మతల్లి జాతర ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే, సుడా చైర్మన్ జీవీ రామకృష్ణారావు అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ముదిరాజ్‌ల ఆరాధ్యదైవం పెద్దమ్మతల్లిని భక్తి శ్రద్ధలతో కొలుస్తూ జాతర నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రభుత్వం దేవాలయాలు, కులవృత్తుల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తోందన్నారు. ముదిరాజ్‌లలకు చేపపిల్లల పంపిణీ, ద్విచక్ర వాహనాలు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ తాళ్లపల్లి శేఖర్‌గౌడ్, సర్పంచ్ రొడ్డ పృథ్వీరాజ్, ఎంపీటీసీ పిట్టల కవితమధు, ఉప సర్పంచ్ మురళి, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు నెల్లి శంకర్, తదితరులు పాల్గొన్నారు.



రామడుగు: పోచమ్మ బోనాలతో వెళ్తున్న గౌడ కులస్తులు



గంగాధర: నారాయణపూర్‌లో బోనాలతో మహిళలు



పెద్దమ్మతల్లి బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే రవిశంకర్



మొక్కులు చెల్లిస్తున్న ఎమ్మెల్యే, సుడా చైర్మన్

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



రాజ్యాంగం పుస్తకాలను అందిస్తున్న చిలుముల రమేశ్

రామడుగు: గల్ఫ్ దేశాలకు వెళ్లే ప్రతి కార్మికుడు అక్కడి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని కరీంనగర్ జిల్లా గల్ఫ్ జేఏసీ అధ్యక్షుడు చిలుముల రమేష్ అన్నారు. మండలంలోని కొక్కెరకుంట గ్రామంలో ఆదివారం గల్ఫ్ కార్మికుల అవగాహన చైతన్య యాత్ర నిర్వహించారు. కార్యక్రమానికి హాజరై గల్ఫ్ నుంచి రిటర్న్ వచ్చిన కార్మికులకు అక్కడ చట్టాలపై అవగాహన కల్పించారు. గల్ఫ్ వెళ్లేవారు నకిలీ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని హెచ్చరించారు. లైసెన్స్ ఉన్న ఏజెంట్స్ ద్వారానే వెళ్లే ప్రయత్నం చేయాలని సూచించారు. విజిట్ వీసాలపై వెళ్లి అక్కడ పడరాని ఇబ్బందులు పాడొద్దని తెలిపారు. జిల్లా యువజన అవార్డు గ్రహీత గజ్జెల అశోక్ మాట్లాడుతూ.. గల్ఫ్ వెళ్లే కార్మికులు తప్పకుండా బీమా చేసుకోవాలన్నారు. అనంతరం కార్మికులకు భారత రాజ్యాంగం పుస్తకాలను పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మల్లయ్య, పర్శారాం, మహేష్, నవీన్, వెంకటేష్, సతీష్, అరవింద్, కార్తీక్, విష్ణు, గణేష్, వేణు, రాములు పలువురు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మానకొండూర్: ప్రధాని మోదీతోనే దేశాభివృద్ధి జరుగుతుందని, అల్పకాలిక విస్తారక్ వెంకటేశ్ అన్నారు. మండలంలోని ఈదులగట్టెపల్లి, అన్నారం, లలితాపూర్, దేవంపల్లి గ్రామాలలో ఇంటింటికీ బీజేపీ కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాలలో బూత్‌ల పరిశీలన చేశారు. నరేంద్రమోదీ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాలను ప్రజలకు అందజేస్తూ అభివృద్ధిని వివరించారు. మండల అధ్యక్షుడు ప్రవీణ్, అప్పని తిరుపతి, ముద్దసాని కార్తీక్, నరేష్, ఆరెల్లి శ్రీహరి, సంతోష్, కాల్వ చిరంజీవి, ప్రవీన్, గాడిచర్ల భూమయ్య, సంపత్ నాయకులు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని పద్మశాలీ వాడ, లెక్చరర్స్ కాలనీలో మేరా బూత్ సబ్‌సే మజ్బూత్ కార్యక్రమంలో భాగంగా శక్తి కేంద్ర పరిధి 12వ బూత్ కమిటీల సమావేశం నిర్వహించారు. అల్పకాలిక విస్తారక్ రాధాకిషన్ మాట్లాడుతూ.. దేశంలో అన్ని వర్గాల ప్రజలకు మోదీ ప్రభుత్వం అండగా ఉంటుందని, అనేక రకాల ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు జీడీ మల్లేష్, మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్, కోరే రవీందర్, పల్లపు రవి, అప్పం మధు యాదవ్, ఇటికాల స్వరూప, ఎదులపురం అశోక్, కంకణాల రమారెడ్డి, ఠాగూర్ రాజేష్, రావుల శ్రీనివాస్, ఠాగూర్ రాకేష్, రామ్, రవి, శ్రీనివాస్ బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

రామడుగు: మండలంలోని వెదిర గ్రామంలో బీజేపీ నాయకులు మహా సంపర్క్ అభియాన్‌లో భాగంగా ఇంటింటికీ తిరిగారు. ప్రధాని మోదీ తొమ్మిదేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అల్పకాలిక విస్తారక్ సుభాష్, చొప్పదండి నియోజకవర్గ కోఆర్డినేటర్ జాడి బాల్‌రెడ్డి, నాయకులు ఎడవెల్లి రాజిరెడ్డి, మహేష్, శ్రీనివాస్, సత్యనారాయణరెడ్డి, గంగారాజు, ప్రశాంత్‌రెడ్డి, అనిల్‌కుమార్, రాములు, శ్రీనివాస్ పలువురు పాల్గొన్నారు.

సమాజ అభివృద్ధిలో భాగస్వాములవ్వాలి



హుజూరాబాద్: రిటైర్డు ఉద్యోగులు సమాజ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం పట్టణంలోని వెంకటసాయి గార్డెన్‌లో హుజూరాబాద్ బ్రాంచ్ హెడ్ పోస్ట్ మాస్టర్ ఇల్లందుల సమ్మయ్య పదవి వీరమణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులు మెరుగైన సేవలందిస్తేనే సమాజంలో మంచి స్థానం ఉంటుందన్నారు. అనంతరం సమ్మయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. పోస్టల్ ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

సాయిచంద్ సేవలు మరువలేనివి



చొప్పదండి: రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్, గాయకుడు, ఉద్యమకారుడు సాయిచంద్ సేవలను రాష్ట్ర ప్రజలు మరువలేరని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ అన్నారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఆదివారం కవులు, కళాకారుల ఆధ్వర్యంలో సాయిచంద్ సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. తన గళంతో తెలంగాణ ఉద్యమ ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకెళ్లిన ఘనత సాయిచంద్‌కు దక్కుతుందని కొనియాడారు. సీనియర్ ఉపాధ్యాయులు బత్తుల భూమయ్య ఆధ్వర్యంలో జరిగిన సభకు డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, మాచర్ల వినయ్‌కుమార్, బత్తుల లక్ష్మినారాయణ, తాళ్ళపల్లి శ్రీనివాస్‌గౌడ్, పెద్దెల్లి శ్రీనివాస్, గుర్రం నాందరెడ్డి, ఛత్రపతి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు ఎంపిక పోటీలు



మానకొండూర్: 2023 –24 విద్యా సంవత్సరానికి క్రీడా పాఠశాలలో ప్రవేశానికి ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నామని మండల విద్యాధికారి మధుసూదనాచారి తెలిపారు. ఈనెల 5న నాలుగో తరగతి, 6న ఐదో తరగతి విద్యార్థులకు మండల స్థాయి ఎంపిక పోటీలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో(బాలుర) ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామని, నాలుగో తరగతిలో ప్రవేశానికి మూడో తరగతి పూర్తయి నాలుగో తరగతి చదువుతూ ఉండాలని, ఐదవ తరగతిలో ప్రవేశానికి నాలుగో తరగతి పూర్తయి ఐదో తరగతి చదువుతూ ఉండాలని, స్టడీ సర్టిఫికెట్స్, ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకురావాలని కోరారు.

శివాలయంలో ఎమ్మెల్యే ఈటల పూజలు



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే ఈటల

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని సిర్సపల్లి గ్రామం శివాలయంలో ఆదివారం ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. వెంట స్థానిక నాయకులు, తదితరులు ఉన్నారు.

గీతా మందిర్‌లో 'గురుపూజోత్సవం'

జమ్మికుంట: పట్టణంలోని గీతా మందిర్‌లో రాష్ట్రీయ స్వయమ్ సేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) ఆధ్వర్యంలో వ్యాసపౌర్ణమిని పురస్కరించుకొని ఆదివారం గురుపూజోత్సవం నిర్వహించారు. కార్యక్రమానికి హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతర భగవత్ ధ్వజం(కాషాయ జెండా)ను గురువుగా భావించి, మన, ధన సమర్పణ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు,అర్ఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

బిజిగిరిషరీఫ్ దర్గాను దర్శించుకున్న ఎమ్మెల్యే

జమ్మికుంట: మండలంలోని బిజిగిరిషరీఫ్ హజ్రత్ సయ్యద్ ఇంకుషావలి దర్గా ఉర్సు ఉత్సవాల సందర్భంగా హుజూరాబాద్ బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ దర్గాలోని సమాధులకు చాదర్లు సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. దర్గా కమిటీ ఈటల రాజేందర్‌ను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో దర్గా కమిటీ అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్, ఉపాధ్యక్షుడు మహ్మద్ అబ్దుల్ కరీం, కార్యనిర్వహణ అధ్యక్షుడు మహ్మద్ తౌషిక్ హుస్సేన్, కార్యదర్శి మహ్మద్, కమిటీ సభ్యులు నయిమొద్దీన్, అహ్మద్, లతీఫ్ హుస్సేన్‌అజమ్, జలీల్, హైదర్, తాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీబంధు వర్తింపజేయాలి

సైదాపూర్: బీసీ కులాలందరికీ బీసీబంధు పథకం వర్తింపజేయాలని కురుమ సంఘం మండల అధ్యక్షుడు పెద్ది తిరుపతి, కేవైసీఎస్ మండల అధ్యక్షుడు వెంగళ రవి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో మాట్లాడారు. దళితబంధులాగే కురుమలకు రూ.10 లక్షలు ఇస్తేనే ఉపాధి పొందుతారని అన్నారు. ముప్పై శాతం లబ్ధిదారులతో వాటా కట్టించుకుని ప్రభుత్వం అందించే గొర్రెలు వాతావరణాన్ని తట్టుకోలేక చనిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.